# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  14-04-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన దాడికి సంబంధించిన నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపినట్టు విజయవాడ పోలీస్ కమీషనర్ కాంతిరాణా టాటా తెలిపారు.
- “గరీబ్, యువశక్తి, అన్నదాత, నారీశక్తి” ప్రధానాంశాలుగా ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించామని బీజేపీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలియజేశారు.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాలను దేశ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.
- వైశాఖి పండుగను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

========================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిపై నిన్న జరిగిన దాడికి సంబంధించిన నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపినట్టు విజయవాడ పోలీస్ కమీషనర్ కాంతిరాణా టాటా తెలిపారు. ముఖ్యమంత్రిపై జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అందజేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తు కోసం 20 మంది సిబ్బందితో 6 బృందాలను ఏర్పాటు చేసినట్టు కమీషనర్ వివరించారు.

మరోపక్క... నిన్న జరిగిన దాడిలో కన్నుకు గాయం కావడంతో ముఖ్యమంత్రి... “మేమంతా సిద్ధం” యాత్రకు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. ముఖ్యమంత్రిపై దాడిని వైఎస్సార్ పార్టీ నేతలతో పాటు తెలుగుదేశం, బీజేపీ, జనసేన, తదితర పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. బీజేపీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనను ఖండిస్తూ... జగన్‌మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహా వివిధ పార్టీల నేతలు ముఖ్యమంత్రిపై జరిగిన దాడిని ఖండిస్తూ వివిధ మాధ్యమాల ద్వారా ప్రకటనలు చేశారు.

========================

భారతీయ జనతా పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఈరోజు ప్రకటించింది. పార్టీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో "సంకల్ప పత్ర" పేరిట రూపొందించిన మేనిఫెస్టోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో విడుదల చేసి, కీలక అంశాలను వెల్లడించారు. గరీబ్, యువశక్తి, అన్నదాత, నారీశక్తి ఈ అంశాలు నాలుగు స్తంభాలుగా మేనిఫెస్టోను సిద్ధం చేశామని, దేశ యువత ఆకాంక్షలను ఇది ప్రతిబింబిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి కల్పన, అంకుర సంస్థలకు ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో గ్లోబల్ సెంటర్ల ఏర్పాటుపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. బీజేపీ పాలనలో అభివృద్ధి, సంస్కృతి రెండింటికీ ప్రాధాన్యం ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతి రోజు మేనిఫెస్టోను విడుదల చేయడం సంతోషంగా ఉందని, ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తున్నామని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైశాఖి పండుగను పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ దేశప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రపతి ఒక ప్రకటన చేస్తూ దేశంలోని రైతుల నిరంతర కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైశాఖి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలోనూ శ్రేయస్సును, శాంతిని తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుచుకునే ఈ పండుగ భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఉప రాష్ట్రపతి వివరించారు. దేశవ్యాప్తంగా రైతులు పంటలు బాగా పండినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ... రాబోయే కాలంలో శ్రేయస్సు కోసం ప్రార్థనలు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈరోజు నుండి రెండు రోజుల పాటు సాంప్రదాయ పంటల పండుగగా జరుపుకుంటున్నారు. 1919వ సంవత్సరంలో ఇదే రోజున, అమృత్‌సర్ లోని జలియన్‌వాలాబాగ్ లో బ్రిటిష్ జనరల్ డయ్యర్ ఆదేశాలతో విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో అనేక మంది నిరాయుధ దేశభక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజలు జలియన్‌వాలాబాగ్ చేరుకుని అమరవీరులకు నివాళులర్పిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నవభారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు ఘనంగా జరిగాయి. హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈరోజు తిరుపతిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంబేద్కర్ ఆదర్శాలను, ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ... అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ అంబేద్కర్ అని కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.అరుణ్ బాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఇచ్చిందని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని, అంబేద్కర్ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వివిధ జిల్లా కేంద్రాల్లో జరిగిన వేడుకలలో కలెక్టర్లు, పలు శాఖల ఉన్నతాధికార్లు పాల్గొని అంబేద్కర్ కు ఘనంగా నివాళులు అర్పించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధస్సు ఆధారంగా ఎలక్షన్ మిత్ర పేరిట ఒక సాధనాన్ని రూపొందించినట్టు వైఎస్సార్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ప్రచురణలతో పాటు, అవసరమైన సమాచారాన్ని వినియోగదారులకు అందించేలా జిల్లా పోలీసులు దీనిని తయారు చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల మాన్యువల్‌లు, హ్యాండ్‌బుక్‌లు, సర్క్యులర్‌లు, ప్రెస్ నోట్‌లు, ప్రకటనలు, MCC కోడ్ మొదలైన వాటితో సహా 25 వేలకు పైగా పేజీల

అంశాలను ఇందులో పొందుపరచినట్టు వివరించారు. వివిధ ప్రధాన నేర చట్టాల వంటి పోలీసు సంబంధిత అంశాలు ఇందులో ఉంటాయని, ఈ సాధనంలోని సమాచారం వివిధ స్థాయి పోలీసు అధికారులకు సైతం ఉపయోగపడుతుందన్నారు.

=========================

ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యే విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన అవసరం లేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్  స్పష్టం చేశారు. టీసీలు, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకోవడంలో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఫలితంగా డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోందని ఆయన వివరించారు. దీనిని నివారించేందుకు టీసీలు తప్పనిసరన్న నిబంధనను సడలించినట్టు తెలిపారు. విద్యార్థులకు చైల్డ్ ఐడీలు, శాశ్వత ఎడ్యుకేషన్ నంబరును కేటాయిస్తున్నామని చెప్పారు.

=========================

అర్హులైన వారంతా రేపటి లోపుగా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని అనకాపల్లి జిల్లా డిఆర్‌వో దయానిధి సూచించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో కలిపి ప్రస్తుతం 12 లక్షల 79 వేల 685 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు.

=========================

ఇంటర్ లో ప్రవేశాల ప్రక్రియను మే 15 నుంచి ప్రారంభించనున్నట్టు ఇంటర్మీడియట్ విద్యామండలి అధికారులు వెల్లడించారు. ఈ మేరకు షెడ్యూల్ తో ప్రకటన విడుదల చేశారు. రెండు విడతలుగా ఇంటర్ ప్రవేశాలు నిర్వహిస్తామని, మొదటి విడతలో మే 15 నుంచి దరఖాస్తులు విక్రయించి, జూన్ 1 లోపు వాటిని స్వీకరిస్తామన్నారు. మే 22 నుంచి మొదటి విడత ప్రవేశాలు చేపట్టి, జూన్ 1 లోపు పూర్తి చేస్తామని, రెండో విడత ప్రవేశాలను జూన్ 10 నుంచి జులై 1 లోపు పూర్తి చేస్తామని అధికారులు తెలియజేశారు.

=========================

విశాఖ ఉక్కు కర్మాగారంలో “నేషనల్ ఫైర్ సర్వీస్ డే” కార్యక్రమాలు ఈరోజు మొదలయ్యాయి. 1944 సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన బాంబే డాక్ పేలుడులోను, ఆ తరువాతి సంవత్సరాల్లో విధుల్లో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించేందుకు ప్రతి సంవత్సరం ఈరోజును "నేషనల్ ఫైర్ సర్వీస్ డే"గా పాటిస్తున్నారు.

=========================

=========================